

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక
(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 12 జనవరి, 2016 సంచిక : 8

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**
**శ్రీ మాతా శుకవాణి**
భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech

**సాయివాణి చందా వివరాలు**
ద్వైవార్షిక చందా.......... రూ॥ 160/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥ 800/-

**చిరునామా :-**
**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),
బొమ్మల రామవరం మండలం,
నల్గొండ జిల్లా - 508 126.
**Ph : 9440413455, 9848133565**
E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com

**విషయసూచిక** **పుట సంఖ్య**


మా వాణి ........ 2
మేమే కుర్వంతః ........ 4
శ్రీ గజానన విజయం ........ 6
గీత-మానవీయత ........ 8
నది ........ 9
ఆధ్యాత్మిక సాధకులకు ........ 10
షిరిడీ డైరీ ........ 11
స్వరాంజలి ........ 13
జగద్గురు తత్త్వబోధకస్వామి ........ 14
గురువాణి ........ 17
కులవిచక్షణ- ........ 19
గురుదేవులతో కబుర్లు ........ 22
ఆధ్యాత్మిక శిబిరం ........ 24
నిరంతర అధ్యయనం ........ 25
అఖండ శాంతి ........ 28
మాతృసంస్థ కబుర్లు ........ 30







## మా వాణి



ప్రతిసారీ పాఠకుల కోసం మావాణి వ్రాస్తాను గురుదేవా! కానీ యీ సారి- సాయివాణి సంస్థాపకులు, శుకవాణికి దీనికి నామకరణం చేయటం మొదలు పాతికేళ్లపాటు నడుపుకొంటూ రావడం వరకూ గల భాగ్యాన్ని అందించినవారు, ఏ ఒక్క పంక్తి వదలకుండా చదివి, బాగున్న ప్రతి అంశాన్నీ మనసారా అభినందిస్తూ, దోషాలున్న చోట్ల చర్చించి సరిచేస్తూ ఎంతో శక్తిని పంచినవారు-మీరు లేని యీ ఇరవై ఆరవ జన్మదినాన సాయివాణికి ఏమని వ్రాయగలను గురుదేవా? పెదవులు కదుపుతున్నా మూగదాన్నై, కలం కదుపుతున్నా కళ చెదిరిన భావాలతో- ఏమి వ్రాయను?

ఆదిలో యీ పత్రికకు పాలసీగా సామాజిక స్పృహ, ఆధ్యాత్మిక ప్రగతి కలిసి నడవడాన్ని నిర్ణయించారు మీరు. ఆధ్యాత్మికతకు ఆధారం ధర్మం- ధర్మానికి మూలం ఆధ్యాత్మికత. ఇవి పరస్పర ఆధారితాలు. అందుచేత "ధార్మిక, సామాజిక మాసపత్రిక" అని వ్రాసారు. "మతం అన్నది ఆధ్యాత్మిక మార్గమేగానీ, అదే ఆధ్యాత్మికత కాదు. ఆచారాలు, సంప్రదాయాలు మనిషినీ, వ్యవస్థనూ సక్రమంగా నడపడానికేగానీ అవే ముక్తి మార్గాలని భ్రమించకూడదు. కులాలు, వర్ణాలు వగైరాలు సమాజ గతికి పనికి వచ్చేవేగానీ-"ఆకృతులు వేరైనా ఆత్మ ఒక్కటే"-అన్న సూత్రం ఆధ్యాత్మికతలో ముందుకు నడవదలచిన వాళ్లంతా గుర్తుంచుకొని తీరవలసిన విషయం"- అని మీరు చెప్పారు. దానికి అనుగుణంగానే యింతకాలం నడుస్తూ వచ్చింది మీ మానసపుత్రికైన యీ పత్రిక.

బాబా మీద ప్రగాఢ విశ్వాసం ఉన్న వారికి వాస్తు, నక్షత్రాలు, గ్రహాలు,

జాతకాలు, పూనకాలు వగైరాల మీద పట్టింపు ఉండదు. సంకల్పించేవాడు తానైతే సిద్ధింపజేయవలసినవాడూ తానే గదా! అన్న గట్టి నమ్మకం ఉండటమే దీనికి కారణం. అంతటి మహాశక్తి నాతో ఉంటే నాకేం భయం! సమస్త విశ్వానికీ సృష్టికర్త నా ప్రభువే అయితే నాకు అడ్డుపెట్టగల శక్తి ఎవరికుంటుంది!" అన్న ధీమా మనకు బలాన్నిస్తుంది"- అని చెప్పారు మీరు. అందుకే మన పత్రిక ఎన్నడూ వాటిని ప్రోత్సహిస్తూ వ్రాయలేదు.

త్రికరణ శుద్ధిగా దీని ముద్రణ భారాన్ని మీద వేసుకొని సహకరిస్తున్న శ్రీ వి.వి. కృష్ణారావుగారినీ, దీనికి అట్టహాసం కలిగించాలని ప్రయత్నిస్తూ ఉత్సాహం చూపే చి॥ రాంబాబునూ, నెలనెలా చందాదారులకు అందించడానికి పేకింగ్ వగైరాలకు తోడ్పడే ఆశ్రమ చిరంజీవులనూ, టీచర్లనూ యీ సమయంలో ఆశీర్వదించండి. తమ రచనలు అప్పడప్పడూ పంపిస్తూ సహకరించే మిత్రులకు కృతజ్ఞతలు చెప్తున్నాను. దీనికి కొంత మూలధనాన్ని సేకరించి పెట్టాలన్న కల మాత్రం యింతవరకు నెరవేరలేదు గురుదేవా! అదెప్పటికి నెరవేరుస్తారో మీరు!

ఈ నెల నుండి "గురువాణి" శీర్షిక ప్రారంభం చేస్తున్నాము. అప్పడప్పడూ మీరు చెప్పిన అమృతవాక్కులు, ఉపదేశాలు, సందేశాలు, చిట్టి పొట్టి కథలు వగైరాలన్నీ ఆ శీర్షిక క్రింద ముచ్చటించుకుందామని నా ఆశ. అవన్నీ నాకు గుర్తుచేయవలసిన భారం మాత్రం మీదే సుమా! సాయివాణికి రెండు పదులు నిండిన సందర్భంలో చేసుకున్న ఉత్సవంలో మీరున్నారు. ఇప్పుడు లేరు (భౌతికంగా). మరోసారికి ఎవరుంటారో, ఎవరుండరో, కానీ, అక్షరం మాత్రం న+అక్షరం-నాశనం లేనిది. ఈ సాయివాణిలో వచ్చిన ప్రతి అక్షరమూ పదుగురికీ ఉపయుక్తమై, నిజంగా అక్షరమై నిలవాలనీ, అలాటి అక్షరాలే వ్రాయగల శక్తి మా అందరికీ రావాలనీ మీరు శ్రీ సాయినాథుల ఆశీస్సులను-మాపై వర్షింపజేయండి గురుదేవా! మీకివే మా కైమోడ్పులు.





# "మేమే కుర్వంతేః..."

- మాన్యశ్రీ ఎం.వి. మాధవరావు

వరండాలో కూర్చొని తోటవైపు చూస్తున్నాను. ఒక మూలగా కుక్కకు అన్నం పెట్టే పళ్లెం ఉంది. అందులో కొన్ని మెతుకులు. వాటి కోసం ఒక పిచ్చుక వచ్చి వాలింది. కాస్సేపటికి మరొకటి. ఇంకొకటి ... నాలుగైదు చేరాయి. అంతే ఒకటే కోలాహలంగా కిచకిచలు-ఒక దాన్నొకటి పొడుచు కోవడాలు ... రెండు ఎగిరిపోయాయి - మిగతావి యింకా కీచులాడు కొంటున్నాయి. నాకు నవ్వు వచ్చింది. ఆ పళ్లెం వాటి కోసం నిర్దేశింప బడింది కాదు. అన్నం ఎవరికోసం పెట్టారో ఆ కుక్క తనకు కావలసినంత తినేసి వెళ్లిపోయింది. తరువాత ఎక్కడిదో యింకో కుక్క వచ్చి మిగిలింది తిన్నది. ఇక కొద్ది మెతుకులు మిగిలాయి. ఇవి - యీ పిచ్చుకలు వచ్చి తమ సొమ్మే పక్కవి తింటున్నట్లు పోట్లాడుకుంటున్నాయి. మానవులు కూడా యింతే గదా!

విశ్వమంతా విశ్వేశ్వరుడిది. ఆయన మనకిచ్చినదేదో 'మనది' అనుకొంటున్నాం. కానీ, అది కూడా మొత్తం మనం తినడానికి కాదనీ, మనం దానికి ధర్మకర్తలుగా నిలబడి, పది మందికి పంచడానికనీ గుర్తించం. నలుగురితో కలిసి తినటంలో ఉన్న ఆనందం ఒంటరిగా దిగ మింగడంలో లేదని గ్రహించే వారు చాలా తక్కువ. 'నేను-నా వారు' యీ స్థాయి నుంచి 'మేము-మా వారు' దీనికి ఎదగటం కొంతవరకూ తేలికే. కానీ 'మనం' దాకా పెరగటం చాలా కష్టం. దానికి ఎంతో అవగాహన, త్యాగశీలత ఉండాలి. 'ఈశావాస్య మిదగ్ం జగత్సర్వం' అన్న భావన కలగాలి. "తేన త్యక్తేన భుంజీథ" - విశ్వమంతా నిండి ఉన్న పరమపిత సొత్తును ఇతరులకు (సర్వులూ దైవస్వరూపులే గనుక) పెట్టి

మిగిలినదే మనం స్వీకరించాలి" అన్న విజ్ఞత వికసించాలి. అది చాలా అవసరం.

**"అశనం మే, వసనం మే, పత్నీమే బంధువర్గోమే**
**ఇతి మేమే కుర్వంతః కాలవృకోహంతిమనుష్యాణామ్"**


ఆహారం నాది, వస్త్రం నాది, భార్య నాది, బంధువర్గమంతా నాది అంటుంటారు మనుష్యులు. సంస్కృతంలో నాది అంటే 'మే'. ప్రతిదానికీ మే, మే అనే వాళ్లను కాలం అనే తోడేలు మింగేస్తుంది. 'మే, మే అని అరిచేవి మేకలు గదా!) అన్నాడు కవి చమత్కారంగా.

మనం ఎంత తెలివితక్కువగా ప్రవర్తిస్తామో గమనిస్తే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ఇవ్వేళ ప్రొద్దున్నే నా గది ముందరి గులాబి మొక్కకు ఒక చక్కని గులాబి పూసింది. రంగు, రూపం కూడా ఎంతో అందంగా ఉన్నాయి. దాని చక్కదనాన్ని చూస్తూ, దాన్ని సృష్టించిన వాడి సౌందర్యాన్ని భావిస్తూ, ఆ ఆనందాన్ని అనుభవిస్తున్నాను. అంతలో ఒక కుర్రవాడు వచ్చాడు. చటుక్కున ఆ పువ్వు తుంచేసాడు. 'ఎందుకురా కోసేసావు?' అంటే - దేవుడికి పెట్టడానికి-అన్నాడు. పాపం, ఎంత అమాయకుడు! ఆ గులాబి మొక్క తెలతెలవారుతుండగానే తన రెమ్మ చెయ్యి చాపి భగవంతునికి నివేదన చేసింది ఆ పువ్వు. ఇప్పడీ పిల్లవాడు చేసేది ద్వితీయ నివేదన. అంటే సెకండ్‌హేండ్ ఆఫరింగ్ అన్నమాట. మనందరం యింతే. విశ్వమంతా విభుని ప్రాణమందిరమే అని మరచిపోయి, ఆయన పువ్వులు, కొబ్బరి కాయలు, వస్తువులు-అన్నీ ఆయన ముందు పెట్టి "ఆహా! బాగా పూజించాం' అనుకొంటాము. లోపల ఉన్న జ్యోతిని చూడటం మర్చిపోయి బైట వెలిగే దీపాలను చూచి మురిసిపోతాం. ఈ పూజలు అవసరమే. ఎంతవరకు? అంతర్జ్యోతిని కనగలిగే శక్తి సాధించుకోవడానికి తొలి మెట్లుగా మాత్రమే. అదే చరమలక్ష్యం కాదన్న గ్రహణలో లోన నిరంతరం మెలుగుతుండటం చాలా అవసరం.





# శ్రీ గజానన విజయం



- ప.పూ.శ్రీశ్రీశ్రీ సత్యపదానంద ప్రభుజీవారు
(గత సంచిక తరువాయి)

## 12వ అధ్యాయం

బచ్చులాల్ అగర్వాల్ అనే ఒక ధనికుడు అకోలాలో ఉండేవాడు. ఆయన మంచి దాత కూడా. ఆయన ఖరంజాకు చెందిన లక్ష్మణ్ కథ విన్నాడు. అది సత్యమో కాదో తెలుసుకోదలుచుకున్నాడు. బచ్చులాల్ అలా ఆలోచించే సమయంలోనే గజాననులు వారి దగ్గరకు వచ్చి వరండాలో కూర్చున్నారు. బచ్చులాల్ చాలా సంతోషంగా స్వామీజీకి నమస్కరించి ఆయనకు ఘనంగా పూజ చేయాలనుకున్నాడు. గజాననులు అంగీకరించారు.

బచ్చులాల్ స్వామీజీకి చక్కగా నూనెరాసి అభ్యంగన స్నానం చేయించాడు. జరీ అంచున్న ఒక పట్టు పీతాంబరం, ఒక చక్కని కాశ్మీరీ శాలువా, జరీ అంచు తలపాగా సమర్పించుకున్నాడు. తరువాత మెడలో బంగారు గొలుసు, చేతులకు కంకణాలు, వేళ్లకు వజ్రాల ఉంగరాలు, రత్నాల కంఠహారం ధరింపజేశాడు. జిలేబి, పాలకోవా, రగడ మొదలైన మిఠాయిలు తినిపించి సుగంధద్రవ్యాలతో కూడిన తాంబూలం ఇచ్చాడు. పరిమళాలతో కూడిన పన్నీరు పైన చల్లాడు. పదివేల బంగారు నాణాలు ఉన్న బంగారు పళ్లెరాన్ని కానుకగా సమర్పించాడు. అప్పడు వినయంగా యిలా ప్రార్థించాడు. "స్వామీ! రామాలయం కట్టాలని నాకో కోరిక ఉంది. ఏటా శ్రీరామనవమి సమయంలో యీ వరండాలో చోటు చాలక యిబ్బంది అవుతోంది. నా కోరిక నెరవేరేలా ఆశీర్వదించండి".

గజాననులు చిరునవ్వుతో యిలా అన్నారు. "ఆ జానకిరాముడే నీ కోరిక నెరవేరుస్తాడు. అది సరే, నన్ను ఇలా గంగిరెద్దులా అలంకరించా వెందుకు? నన్ను మాయలోకి లాగాలనుకుంటున్నావా! నీ సంపద

చూపించాలనుకుంటున్నావా! నేను సన్యాసిని, దిగంబరముగా తిరుగుతుంటాను. ఈ వస్తువులన్నీ నేను ఏమి చేసుకోను? ఇవన్నీ తీసివేసుకో. నీవు సంసారివి, నీకు డబ్బు అవసరం. నా ప్రభువు భీమా నది ఒడ్డున ఉన్నారు. ఆయన నాకు ఇవ్వలేరూ!" ఈ మాటలు అంటూనే గజాననులు నగలన్నీ విసిరికొట్టి పీతాంబరం చించి పారేసి రెండు పాలకోవా బిళ్లలు చేతితో పుచ్చుకొని వెళ్లిపోయారు.

అకోలా ప్రజల్లో కొందరు అక్కడున్నారు-ఆ సమయంలో లక్ష్మయ్య కూడా బచ్చూలాల్ లాగే ఘనంగా పూజించాడు స్వామీజీని. కాని అతనికి ధనం మీది ప్రీతి ఎక్కువ. పైకి మాత్రం సన్యాసం గురించి మాట్లాడేవాడు. మహరాజుకు ఆ మాత్రం తెలియదా! అతిశయం చూపించే భక్తులు స్తోత్రాలు బాగా చేస్తారు. ఓ కుళ్లిపోయిన పండు చేతిలో పెట్టి అవే మిఠాయిలని చెప్పబోతారు, వారు యిచ్చిన దానికి తగిన ప్రతిఫలాన్నే పొందుతారు-లక్ష్మణ్‌లాగే అనుకున్నారు. అందరూ బచ్చూలాల్ నిజంగా గొప్పవాడు. గజాననుల వల్ల ఆశీస్సులు పొందాడు. దివ్యానందాన్నీ పొందగలడు. సంపద పోగొట్టుకోడు. బచ్చూలాల్ గజాననుల కోసం ఊరంతా వెదికాడు. ఆయన ఎక్కడ కనిపించలేదు. పీతాంబర్ అని ఒక శింపీ జాతికి చెందిన కుట్టు పనివాడు (దర్జీ) ఉన్నాడు. సరైన బట్టలు లేని పేదరికంతో ఉన్నప్పటికీ గజాననులను భక్తితో కొలిచాడు. ఒకసారి వారు కొంటెతనంగా యిలా అన్నారు - "అరేయ్ నీ పేరేమో పీతాంబర్. ఒంటి మీద ఉన్నవేమో చింకిపాతలు. భలేగా ఉంది. ఒక ఆమె పేరు సోనూబాయి. కనీసం సీసపు నగలు కూడా ఉండవు. గంగాబాయికి త్రాగడానికి గుక్కెడు నీళ్లు కూడా దొరకవు. సరే, ఇదుగో యీ వల్లెవాటు తీసుకో. ఎవరు వెక్కిరించినా దీనిని వదిలిపెట్టకు" పీతాంబర్ అలాగే వేసుకున్నాడు. అందుకు చాలామంది అతన్ని వెక్కిరించారు. నీకు బుద్ధి ఉందా? స్వామి వారు దుస్తులు ధరించి ఆయనను అవమానించావు. ఇక్కడ ఉండకు వెళ్లిపో" అని బెదిరించారు. పీతాంబర్, తాను మహారాజు ఆజ్ఞనే పాలిస్తున్నానని చెప్పినా వాళ్లు వినకుండా తగువాడారు. ఈ కబురు





గజాననులకు తెలిసింది. అతన్ని పిలిపించి, "పీతాంబర్! యిప్పుడు నీ భక్తి చక్కగా కుదురుకొన్నది. బిడ్డ పెద్దవాడైనప్పుడు తల్లి అతన్ని ఎంత ఎత్తుకైనా పంపించవచ్చు. నా ఆశీస్సులు నీకు ఎప్పుడైనా ఉంటాయి. నీకిష్టం వచ్చిన చోటికి వెళ్లిపోయి హాయిగా తిరుగుతూ బ్రతుకు" అన్నారు.

**(సశేషం)**




# గీత–మానవీయత

**- భవాన్స్ జర్నల్ వార్త ఆధారంగా**

"నేను భగవద్గీత చదవటం వలన చాలా ఆనందపడ్డాను. గీత వలన మానవ జీవితపు విలువలెన్నో నాకు అర్థమయ్యాయి. అత్యద్భుతమైన జీవన సూత్రాలెన్నిటినో గీత నేర్పింది. మానవాళి అనేకానేక మతాలను సృష్టించుకున్నది. కానీ, మతాలన్నిటినీ మించిన మహత్తర మతం మానవత్వమేనని యీ పవిత్ర గ్రంథం స్పష్టంగా తెలియజెప్పింది." - ఈ మాటలన్నది ఒక ఆరవ తరగతి విద్యార్థిని. ఆమె బొంబాయిలోని ఒక కాస్మో పాలిటన్ పాఠశాలలో చదువుతోంది.

ఇస్కాన్ అంతర్జాతీయ సంస్థ వారు ఇటీవల శ్రీమద్భగవద్గీత ఛాంపియన్‌లీగ్ పోటీ నిర్వహించగా అందులో 105 ప్రైవేటు పాఠశాలలు, బొంబై మున్సిపల్ పాఠశాలల తరపు నుండి-మొత్తం మీద 4,500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒక్క నెలరోజుల ముందుగా గీత (ఇంగ్లీషులో) పుస్తకాలు ఇచ్చారు అభ్యర్థులకు. వాళ్లకు గీతాధ్యయనం చేసి, అవగాహన చేసుకోవడానికి వీలుగా ఉపాధ్యాయుల సహకారం అందేలా చేసారు. మాసాంతంలో 100 ప్రశ్నలున్న పేపరుతో పరీక్ష నిర్వహించారు. మొత్తం 4,500 మంది పిల్లల్లోనూ ప్రథమురాలిగా నిలచిన బాలిక పేరు మరియం ఆసిఫ్ సిద్దిఖీ. గీత గురించి పై అభిప్రాయాన్ని వెలువరించిన మరియం వయసు కేవలం పన్నెండేళ్లే.



# నది

- ఎన్. మంజుల

నది అన్నది రెండక్షరాల పదమే
కాని అది అలుపెరుగని, హద్దులేని ప్రయాణం
నా ప్రయాణం జీవకోటికి సహాయం
నేనున్నచోట పచ్చని పైర్లు
నేలేకపోతే భూమంతా బీటలు.
నాకు దయమెండు
నాకు ఆగ్రహమొస్తే శవాలతో ఊళ్ళు నిండు
విష్ణు పాదాలలో పుట్టాను నేను -
ప్రజల పాపాలు కడగంగ గంగనై పారాను.
అందరికి చేయూత నేను
ప్రకృతి పచ్చదనానికి కారణమే నేను
సాగును నా ప్రయాణం సాగరమును చేర
ఆగను నేనెక్కడా ఆటంకములెదురైనా.
ఇదియే నేనిచ్చే ప్రజలకు సందేశము
పరమాత్మను పొంద ఆలస్యమేల?
వడివడిగా కదులుము ఆ స్వామిని చేర.
నన్ను చూచి నేర్చుకోండి
మహిలో మానవత్వాన్ని పెంచుకోండి
స్వార్థం వీడండి, పదుగురి కోసం జీవించండి.
పర హితానికి నేను ఆదర్శం,
నాకులేదు ఏ స్వార్థం
ఓ మానవోత్తమా! నేను నీటితో నిండితే మీరు ప్రేమతో నిండాలి.
నేను జలప్రవాహాన్నైతే
మీరు ప్రేమ ప్రవాహం కండి -
కలసి పదండి,
పృథివి పూలపందిరిగా మారుద్దాం రండి.







# ఆధ్యాత్మిక సాధకులకు సదవకాశము

"దివ్య జీవనసంఘము"నకు చెందిన "యోగ వేదాంత ఫారెస్టు అకాడమీ" 82వ యోగ వేదాంత తరగతులను 1-3-2016 నుండి 29-4-2016వ తేదీ వరకు రెండు మాసముల కొఱకు నిర్వహింపనున్నది. ఈ తరగతులు ఋషీకేశ్, శ్రీ శివానందాశ్రమ ప్రాంగణమునందు జరుగును. 20 నుండి 65 సంవత్సరముల మధ్య వయస్సు గల భారతీయ పురుషులకు ఈ తరగతులు స్థానికముగా నిర్వహింపబడును. ఈ తరగతులు ఆంగ్లభాష యందొసంగబడుటచే విద్యార్థులు పట్టభద్రులై ఆంగ్లభాషలో అనర్గళముగా మాట్లాడుట, చదువుట, వ్రాయుట తెలిసి యుండవలెను. శిక్షణ, వసతి, భోజనములు ఉచితము. దరఖాస్తు ఫారములు ఇక్కడికి చేరవలసిన చివరి తేదీ 20-1-2016. ఈ క్రింది అడ్రసు నుండి దరఖాస్తు ఫారము, శిక్షణ ప్రణాళికలను పొందవచ్చును. అంతేకాకుండా www.sivananda online.org website నుండి కూడా పొందవచ్చును. e-mail yvfa@dishq. org

**ఇట్లు,**
**రిజిస్ట్రార్,**
**యోగ వేదాంత అకాడమీ**
**స్వామీ యోగ వేదాంతానంద**

**చిరునామా :**

**రిజిస్ట్రార్, యోగ వేదాంత ఫారెస్ట్ అకాడమీ,**
**శివానంద నగర్-249192, టెహ్రీ గర్వాల్ జిల్లా,**
**ఉత్తరాఖండ్**

ఓం శ్రీ సాయిరాం



# షిరిడీ డైరీ

– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే
అనువాదం : మాతా శుకవాణి

(గత సంచిక తరువాయి)

25-02-1912

నేను పెందలకడనే లేచి, ప్రార్థించుకొని మాధవరావు దేశ్‌పాండే నాగ్‌పూర్ వెడుతోంటే చూచాను. అక్కడినుండీ అతను నానాసాహెబ్ చందోర్కర్ కొడుకు పెళ్లికి గ్వాలియర్ వెడతాడు. తిరుగుప్రయాణంలో బెనారస్, అలహాబాద్, మధుర తదితర పుణ్యక్షేత్రాలు దర్శించుకొని వస్తాడు. పంచదశి క్లాసు మొదలుపెట్టాం గానీ ఉపాసనీకి అంతగా బాగోలేకపోవటంవలన ముందుకు నడవలేదు. మధ్యాహ్న హారతికి వెళ్లాం. మధ్యాహ్న భోజనం తరువాత పంచదశి మళ్లీ మొదలు పెట్టి కాస్త ముందుకువెళ్లాం. సాయంత్రం దీని తరువాత భీష్మ దాసబోధ చదివాడు.

26-02-1912

కాకడహారతికి వెళ్లాను. సాయిబాబా పెద్దగా ఏమీ చెప్పకుండానే మసీదుకు వెళ్లిపోయారు. నాసిక్ ఆడవాళ్లు యివ్వేళ ప్రొద్దుట వెళ్లారు. మా క్లాసు తరువాత సాయిబాబా బయటికి వెళ్లటం చూచాము. తిరిగి ఆయన మసీదుకు వచ్చాక ఓ కథ చెప్పారు. ఒక యింట్లో ఒక సోదరుడు తన ప్రవర్తన బాగులేక పోవటంతో కులబహిష్కరణ చెందాడు. సాయిబాబా అతని బాగోగులు చూచాడు. కులంలో తిరిగి ప్రవేశపెట్టిం చాడు. మధ్యాహ్నహారతి మామూలుగా జరిగిపోయింది. మధ్యాహ్న భోజనం, కాస్త విశ్రాంతి తర్వాత మేము పంచదశి చదవడం కొనసాగించాం. మిస్టర్ ధాతార్ అనే ఆయన పూనా నుండి ప్లీడరులా కనిపిస్తున్న తన కొడుకుతో వచ్చాడు. వాళ్లు హాల్లో ఉంటున్నారు. బాబా నడకకు వెళ్లేటప్పుడు ఆయన్ని చూడడానికి మసీదుకు వెళ్లాం. వాడా హారతి తర్వాత భాగవతం, దాస బోధ జరిగాయి. అటుపైన భజనలో శ్రీమతి కౌజల్గీ, ఆమె కొడుకు కూడా పాల్గొన్నారు.





27-02-1912

నేను మామూలుగా లేచి ప్రార్థన చేసుకొని పంచదశి క్లాసులో కూర్చున్నాను. సాయిబాబా బయటికి వెళ్లినప్పుడు చూడలేకపోయాము. అంచేత ఆయన తిరిగివచ్చేవరకు దర్శనం కాలేదు. ఉదయం 11 గంటలకు మేము మసీదుకు వెళ్లినపుడు బాబా తామొక చేలో నుంచి నడిచామనీ, అక్కడ చాలా రామచిలుకలు కనిపించాయనీ చెప్పారు. తాము వెళ్లడంతో చిలుకలు బెదిరి చెదిరిపోయాయని, తాము చాలాసేపు వాటి పరిమాణాలు, రంగులు చూస్తూ ఆనందంగా గడిపామని చెప్పారు. మధ్యాహ్నహారతి మామూలుగానే నడిచింది. భోజనం, కాస్త విశ్రాంతి. ఇక మా పంచదశి క్లాసు దాదాపు చీకటిపడేదాకా జరిగింది. అప్పుడు మేము సాయిమహరాజ్ సాయంత్రపు నడక సమయంలో దర్శనానికి వెళ్లాము. రాత్రి వాడా హారతి, తర్వాత శేజారతి నడిచాయి. భీష్మ, దాస బోధ, భాగవతం చదివాడు.

28-02-1912

నేను కాకడహారతికి వెళ్లి ప్రార్థన చెప్పుకుంటూ తిరిగి వస్తూంటే పూనా నుంచి ధోండూ బాబా వచ్చారు. ఆయన ఇటీవలే బర్మా నుంచి వచ్చారు. నేను, నా స్నేహితుడు తిలక్ ఆరోగ్యం గురించి ఆయన మానసిక పరిస్థితి గురించి మాట్లాడుతూ కూర్చున్నాను. ఆ పరిస్థితులలో ఎంత బాగుంటుందో అంతే బాగుంది తిలక్‌జీ పరిస్థితి. ధోండూబాబా నన్ను కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసుకు తిరిగి రమ్మని కోరారు. కాని అది సాయిబాబా మాట మీద ఆధారపడి ఉంటుంది. మా పంచదశి క్లాసు నడిచింది. బాలాసాహెబ్ భాటే కూడా వచ్చాడు. మేము సాయిబాబా బయటికి వెళ్లటం చూచాము. ఆయన తిరిగివచ్చాక మసీదుకు వెళ్లాను. ఆయన నన్ను జీవమణి పనిచేస్తుందా అని అడిగాడు. నాకు అది ఏమిటో తెలియలేదు కాని ఆజ్ఞయితే పని చేస్తుందన్నారు. కాని బాబా చేయదన్నారు. ఆయన నాకు చాలా పళ్లు, మిఠాయిలు ఇచ్చారు. మధ్యాహ్న హారతి జరిగిపోయింది.

ఇవ్వేళ ఏకాదశి గనుక నాతోసహా ఎవ్వరూ ఉదయ ఫలాహారంగానీ, మధ్యాహ్న భోజనంగానీ చెయ్యలేదు. ధోండో బాబా ఉపవాసం ఉన్నారు. ఆయన సాయంత్రం 4 గం.లకు దాదాకేల్కర్ కొడుకు భావూతో కలిసి వెళ్లిపోయాడు. మేమప్పుడు పంచదశి ప్రారంభించాము. సాయంత్రం నడక సమయంలో సాయిబాబా దగ్గరకు వెళ్లాము. ఆయన ప్రసన్నంగా ఉన్నారు. నడుస్తూనే ఛలోక్తులు విసిరారు. వాడాలో భీష్మ భాగవతం, దాసబోధ చదివారు.

(సశేషం)



## స్వరాంజలి

- శుకవాణి

విన్నారె ......
విన్నారె సఖులారా విన్నారె
లోలోపల ధ్వనియించే ఆ పిలుపు ॥వి॥
అల్లంత దూరాన ఆ వనాంతరాన
మ్రోగెనదే మోహనాంగుని మురళి
వేచియున్నాడె - వేగరమ్మన్నాడే (2)
చేరిపోవలెనాతని దివ్యసన్నిధికీ ॥వి॥
శ్రీ షిరిడి గ్రామాన ద్వారకామాయిలో
కొలువయ్యెనే ప్రభువు శ్రీ సాయి రూపాన
భారమిమ్మన్నాడె - దరి జేర్తునన్నాడే
సహనాన సేవింప వలెవాని పాదమును ॥వి॥
నా హృదయ కుహరాన వేరేకు కమలాన
నిలచియున్నాడె స్వామి నిర్మలానందమూర్తి
సాక్షిగా నున్నాడె - సర్వధీ సాక్షియే
పట్టవలెనాతని గట్టి సాధనతోడ ॥వి॥





# జగద్గురు తత్త్వబోధక స్వామి

**- రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ ఫాదరీ చరిత్ర**

**- శ్రీ దిగవల్లి శివరావుగారి కథలు-గాథలు నుండి**

(గత సంచిక తరువాయి)

### ఉత్తరాది తెలుగు జనము

అప్పట్లో మధుర రాజ్యములో అన్ని వర్గాలలోను తెలుగువారు చాలా మంది ఉండేవారు. అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్న తెలుగు వారిలో వివిధ కులాల శూద్రజనాన్ని అరవవారు 'వడుకరు'లు అనగా 'ఉత్తరాది వా'ళ్లని వ్యవహరించేవారు. ఇందులో రెడ్లు, కమ్మవారు, గొల్లలు మొదలైన కులాల వారుండేవారు. ఆ కాలంలో మన తెలుగు వారు ప్రతి విషయం లోనూ అరవలకన్న చొరవకలవారుగా ఉండేవారు. వీరు ఈ ఫాదరీలతో ఎక్కువ స్నేహంగా ఉండి ఆయనను గౌరవించేవారు.

ఈ ఉత్తరాది జనాన్ని క్రైస్తవ మతంలో కలపాలని ఫెర్నాండెజ్ గారు విశ్వప్రయత్నాలు చేశారు. ఏసుక్రీస్తు గురించీ, క్రైస్తవ మతధర్మాలను గురించీ అతడు ఎన్ని విధాలుగానో బోధ చేస్తూ ఉండేవాడు. కాని ప్రయోజనం లేకపోయింది. ఈ ఫాదరీగారు ఎంత మంచివాడైనా గొడ్డు మాంసం తిని, మద్యపానం చేస్తూ, మాల మాదిగలతో కలిసిమెలిసి తిరిగే ఫరంగీ జాతివాడనిన్నీ, అందువల్ల మతంలో కలిస్తే కులభ్రష్టులమై పోతామనిన్నీ భయపడి ఎవరూ క్రైస్తవ మతంలో కలవలేదు.

కుమార కృష్ణప్ప నాయకుడి తరువాత మధుర రాజ్యాన్ని పరిపాలించిన మద్దు కృష్ణప్ప నాయకుడు కూడా క్రైస్తవ మత ప్రచారకులతో స్నేహంగానే ఉండేవాడు. ఇది విని పోర్చుగలు దేశపు రాజు కూడా సంతోషించినట్లు ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల కనబడుతూ ఉంది. ఇలాగ 12 సంవత్సరాలు

ఫెర్నాండెజ్ ఎంత కష్టపడినా క్రైస్తవ మతం వ్యాపించలేదు.

## రాబర్టో డీ నోబిలీ

ఈ పరిస్థితులలో రాబర్టో డీ నోబిలీ అనే క్రైస్తవ మతప్రచారకుడు 1606లో మధురానగరికి వచ్చాడు. నోబిలీ ఇటలీ దేశంలో మాంటీ పుల్చియానో అనే గ్రామంలో క్రైస్తవ మతగురువైన పోపులకు బంధువులైన ఒక గొప్ప కుటుంబంలో 1577లో జన్మించాడు. అతడు చిన్నప్పటినుంచీ తెలివైనవాడు. తన పదవ యేటనే ఐరోపా దేశపు సంస్కృత భాషలన దగిన గ్రీకు, లాటినులను ధారాళంగా మాట్లాడేవాడు. నోబిలీ ఇక్కడికి రాగానే క్రైస్తవ మత ప్రచారం ఎందుకు బాగా జరగడం లేదని పరిశోధన చేశాడు. హిందూ దేశ సముద్రతీరాన ఉన్న కొన్ని రేవు పట్నాలు పోర్చుగీసు వారి స్వాధీనంలో ఉన్నా, పోర్చుగీసు క్రైస్తవ మత ప్రచారకులు హిందూ దేశంలోని లోపలి భాగాలలోకి పోయి ప్రజలతో కలిసిమెలిసి ఉండనందువల్ల మతప్రచారం సాగడం లేదని నోబిలీ గ్రహించాడు. 1607 డిసెంబరు 3వ తేదీన నోబిలీ తన దేశానికి వ్రాసిన ఈ ఉత్తరం వల్ల ఆయన అభిప్రాయాలు తెలుస్తున్నవి :

"మధుర ఈ రాజ్యానికి రాజధాని నగరము. ధనవంతులూ, యుద్ధము లందు ధైర్యవంతులూ అయిన ప్రజలతో కిక్కిరిసి ఉన్నది. కాని ఈ ప్రజలకు అసలు ఈశ్వరుని సంగతి తెలియదు. వారు కేవలము విగ్రహారాధకులు. మన క్రైస్తవ మత ప్రచారకులు 17 సంవత్సరాల నుంచి ఇక్కడ ఉండి పనిచేస్తూ ఉన్నా దేశీయులలో తమ అవసానకాలానికి ముందు క్రైస్తవులైన ముగ్గురు నలుగురు తప్ప ఒక్కడైనా మన మతం స్వీకరించలేదు. ఇలాగని మన మతప్రచారకులు అసమర్థులు కారు. వారు చాలా సమర్థులు. సద్ధర్ములు."

పూర్వకాలమునాటి రోము నగరంలోని విగ్రహారాధనము వంటి విగ్రహారాధనమే ఈ మధురలో ఇప్పుడున్నదని భ్రమించి నోబిలీ ఇంకొక





ఉత్తరంలో వ్రాశాడు.

## క్రైస్తవమతం ఎందుకు వ్యాపించటం లేదు?

ఫెర్నాండెజ్ కృతకృత్యుడు కాకపోవడానికి గల కారణాలను నోబిలీ కనిపెట్టాడు. "రోము నగరంలో ఉన్నప్పుడు ఆ నగరవాసుల లాగనే ప్రవర్తించాలి" అనే సామెత ప్రకారం క్రైస్తవ మత ప్రచారకుడు తాను నివసిస్తూ ఉన్న దేశాచార వ్యవహారాలను గమనించి ఆ ప్రకారమే తాను కూడా ప్రవర్తిస్తేనే తప్ప లాభం లేదనిన్ని, అలా ప్రవర్తించకపోవడమేగాక హిందూ దేశాచారాలయందు అగౌరవము కలిగించేటట్లు ప్రవర్తించడం వల్ల ప్రజలకు అనుమానము, అవిశ్వాసము కలిగి, వారు క్రైస్తవమతం దరికి చేరకున్నారనిన్నీ నోబిలీ కనిపెట్టాడు. అప్పటి విజయనగర చక్రవర్తి యైన రెండవ వెంకటపతి దేవరాయ మహారాయల ఆస్థానంలో ఉంటూ ఉన్న ఆంటోనియో లూబినో అనే ఒక క్రైస్తవ ఫాదరీ కూడా ఇలాగే అభిప్రాయపడ్డాడు. ఈ లూబినో ఒక ఉత్తరంలో ఇలాగ వ్రాశాడు :

"మనము గొడ్డుమాంసము తిని మద్యపానము చేసే పోర్చుగీసు జాతి వారమనే కారణం వల్ల ప్రజలకు మనయందు అసహ్యభావం కలిగి యున్నది. అందువల్లనే మన మతానికి వారిని చేర్చే ద్వారములు మూయ బడినవి. మనమీ రాజ్యములో మద్య, మాంసములను విసర్జించినా మన పట్ల వారికి విరోధము, అసహ్యము కలగడానికి మన నల్లని దుస్తులే చాలు. అందువల్ల మనలను వారొక మహమ్మారిని చూసినట్లు చూస్తారు. మనము పోర్చుగీసు దేశం నుంచి వచ్చిన క్రైస్తవ మత ప్రచారకులమనే సంగతి వాళ్ల మనసులో బాగా నాటుకొని ఉన్నది. అందువల్ల మన కృషిలో ఫలితం కలగాలంటే ముందుగా మనం ధరించే దుస్తులను మార్చుకోవాలి. తినే తిండిని మార్చుకోవాలి. వీలైనంతవరకూ వారు అవలంబించే ఆచారాలను మనం కూడా అవలంబించాలి. రాష్ట్రీయ క్రైస్తవ మతాధికారి (ఫాదర్ ప్రావిన్షియల్)కి యీ సంగతిని గురించి నేను చాలాసార్లు వ్రాశాను. హిందువులు వేసుకునే దుస్తులు ధరింపజేసి, నన్ను ఎవ్వరూ ఎరగని ఊరికి పంపించాలని ఆయన అనుకుంటున్నాడు". **(సశేషం)**

# గురు వాణి

## బురద పోవాలంటే ...

(పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు తమ చెంతకు వచ్చే అనేకానేకమంది భక్తులకు సందర్భాన్ని అనుసరించి ఎన్నో విషయాలు వివరిస్తూ ఉండేవారు. మా పూర్వపుణ్యాన ఆ సమయంలో అక్కడికి చేరువలో ఉంటే అవి మా చెవులలో కూడా పడుతుండేవి. అలా విన్నవాటిలో కొన్ని డైరీలలో వ్రాసి పెట్టుకొనేవాళ్లం. ఆ వ్రాసుకొన్న వాటిలో కొన్నింటిని ధారావాహికగా యివ్వడానికై యీ శీర్షిక ప్రారంభిస్తున్నాము - ప్రధాన సంపాదకులు)

భగవత్సృష్టిలోకెల్ల మాయలమారిది మనిషి మనసే. సహజంగానే వాయుతత్వం కలది కావటం చేత క్షణకాలంలో విశ్వమంతటినీ చుట్టి రాగలదు మనసు. నిజానికి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గానికి అధారభూతమైనది కూడా మనసే. ఇది బాహ్యేంద్రియం కాదు-అంతరింద్రియం. బాహ్యేంద్రియాల నడతను అదుపులో ఉంచుకోవడానికి కొంతవరకైనా అవకాశం ఉంది. ఉదాహరణకు కళ్లు మూసుకోవడం ద్వారా దృష్టిని, చెవులు మూసుకోవటం ద్వారా వినికిడిని.... ఆ విధంగానే అన్నిటినీ కొంతవరకైనా నిలువరించవచ్చు. కానీ, మనసును అరికట్టడం అన్నది చాలా కష్టం-దుస్సాధ్యం. దుస్సాధ్యమేగానీ అసాధ్యం మాత్రం కాదు సుమా! 'సుదుర్నిగ్రహం' అన్నాడు గీతాకారుడు-అంతే! మరి, ఎలా-దేని ద్వారా-ఏ సాధన ద్వారా మనోనిగ్రహం సాధించగలం అన్నది ఆలోచించాలి.

ఆలోచనలే అరిషడ్వర్గానికి మూలాలనుకున్నాం గదా! ఆలోచనలను ఆపితే యీ వైరులు ఆరుగురూ అణగారిపోతారు. ఆలోచనలను ఎలా అణచాలి? ఇక్కడ మనం మనసు యొక్క వివిధాంశాలను చూడాలి.





మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం-ఇవీ ఆ అంశాలు. ఇందులో మనసు ఆలోచించేది. బుద్ధి అందులోని యుక్తాయుక్తాలను విచక్షించి చూపేది. చిత్తం దానిలో ఏది తనకు కావాలో దాన్ని ఎంచుకుంటుంది. ఇది వ్యక్తి జీవలక్షణాలను బట్టీ, శిక్షణను బట్టీ ప్రవర్తిస్తుంది. ఆ ఎంపిక వలన లాభనష్టాలను అనుభవించవలసింది అహంకారం. మనసును అరికట్టదలచుకొన్నవారు బుద్ధికి పగ్గాలివ్వాలి. దాని వివేచనను సవ్యంగా స్వీకరించగలగాలి. అందుకే బుద్ధీ, జ్ఞానం ఉండాలి అంటారుగానీ-మనసూ, జ్ఞానం ఉండాలి అనరు. బుద్ధిమంతుడు, బుద్ధిహీనుడు అనే మాటలేగానీ మనసుమంతుడు, మనసుహీనుడు అన్న మాటలు లేవు.

చిన్న నీళ్లగుంటలో దిగుతాం. కాళ్లు బురదలో కూరుకొని వికారంగా తయారవుతాయి. వాటిని శుభ్రం చేసుకోవాలి. ఏం చేస్తాము? ఆ బురద నీళ్లతోనే బురద కడుక్కోవాలి. అలాగే మనసును అరికట్టడానికి మనసే మార్గం తప్ప మరొకటి లేదు. పరుగులుతీసే మనసును మళ్లీ మనసే బంధించగలదు. ఓవైపు ఆలోచనలు గాడితప్పి పరుగెడుతూండగానే-మరో మనసు 'మళ్లీ దారి తప్పిపోతున్నావ్' అని హెచ్చరిస్తుంది. వెంటనే అక్కడ ఆగి, మెల్లగా మనసు పరుగుతీసిన క్రమంలోనే వెనక్కు ఒక్కొక్క ఆలోచననూ తీసుకువస్తూ ఉంటే-మనం ఎక్కడ పక్కకు వెళ్లటం ప్రారంభించామో అక్కడికి చేరుకుంటాం. వెంటనే అక్కడి నుండి మళ్లీ ధ్యానమో, నామసంస్మరణమో ప్రారంభించాలి. ఇది మనోనిగ్రహానికి ఒక మార్గం.

మరో మార్గం ప్రాణాయామం. శ్వాసను సక్రమంగా నియంత్రించ గలిగితే దాని మీదే ధ్యాస నిలిపితే ప్రాణం-వాయువే ఆధారంగా నడిచే ఆలోచనలు అంటే మనసు కొంతవరకు నియంత్రితమవుతుంది. ఇంకోమార్గం ఆత్మ విచారం. ధ్యానమో, నామ జపమో చేస్తున్నాం. ఏదో ఒక ఆలోచన వచ్చింది. వెంటనే "ఇది నాకు అవసరమా?" "ఇది నా

మార్గానికి దోహదం చేస్తుందా, లక్ష్యాన్ని చెరుపుతుందా?" "ఈ ఆలోచన వెనుక ఎలాంటి దుశ్చింతైనా ఉందా? లేదా గొప్పతనం ఉందా?" ఈ మాదిరిగా విశ్లేషించుకోవటం అలవాటు చేసుకోవాలి. ప్రతి ఆలోచనకూ ఇంతింతసేపు ఆలోచించటం కుదురుతుందా? అన్న సందేహం అక్కర లేదు. పది పదిహేనుసార్లు ఇలా విశ్లేషిస్తూ పోతే కొద్దిసేపటికే ఆలోచనల వేగం తగ్గుతుంది.

పై మూడు పద్ధతుల్లో అవకాశాన్ని బట్టి దేన్నైనా అనుసరించి మనసును మన గుప్పిట్లోకి తెచ్చుకోవచ్చు. అటువంటి స్థితప్రజ్ఞత పొందడానికి గట్టి సాధన అవసరం. శ్రీ సాయిరామానుగ్రహ ప్రాప్తిరస్తు!

# కుల విచక్షణ-మహనీయులు

- 'అవధూతలీల' నుండి

ధర్మశాస్త్రంలో చెప్పబడిన ధర్మసూక్ష్మాన్ని సర్వధర్మజ్ఞులు, బ్రహ్మవేత్తలూ అయిన మహనీయుల నుండి తెలుసుకోవాలని ధర్మశాస్త్రాలే చెపుతాయి. అలా చేయకపోవడం వలన మన సమాజంలో వర్ణవ్యవస్థ తారుమారై ప్రజాశ్రేయస్సుకుపకరించే బదులు దేశానికి దౌర్భాగ్యంగా పరిణమించింది. నేటి సమాజంలో వర్ణభేదం జన్మనుబట్టి వస్తుందని తలచబడుతూంది. కానీ నిజానికది గుణాన్నిబట్టి ఏర్పడిందని భగవద్గీతలో (4:13) చెప్పబడింది. అయినప్పటికీ పండితులు దానిని వక్రించి వ్యాఖ్యానించారని బ్రహ్మవేత్తల బోధల వలన తెలుస్తుంది.

ఉదాహరణకు శిరిడీ సాయిబాబా "మనలో ప్రతి వారిలోను ఒక అంత్యజుడుంటాడు. వాణ్ణి వెళ్ళగొట్టాలి" అన్నారు. ఇక్కడ అంత్యజుడంటే అరిషడ్వర్గాలకు ప్రేరకమైన అజ్ఞానము, దాని ప్రత్యక్ష రూపమైన అహంకారమూ అని మనము గుర్తించాలి. ఈ విషయాన్నే ఆయన మరొకసారి





"వసతిగృహంలోని దొంగలను కనిపెట్టాలి" అని చెప్పారు. జన్మ జన్మకూ మారుతుండే అశాశ్వతమైన శరీరమే వసతిగృహము లేక సత్రము. అది ఎవరికీ స్థిరనివాసం కాజాలదు.

అలానే వారి సమకాలీకులు, మరొక రూపమూ అయిన శ్రీ అక్కల్‌కోట స్వామి ఆ భావాన్నే సూచించారు. ఆయన దర్శనార్థం వచ్చిన ఒక సద్బ్రాహ్మణుడు విధిలేక ఒక హరిజనుడి ఇంటి వద్ద కుండలోని నీటితో స్నానసంధ్యలు పూర్తి చేసుకొని, స్వామిని దర్శించి, బ్రాహ్మణపంక్తిలో భోజనానికి కూర్చున్నాడు. అది గమనించిన స్వామి సేవకుడొకడు అతడిలా చేసినందుకు తీవ్రంగా విమర్శించి, పంక్తిలో నుంచి వెళ్ళగొట్టాడు. ఆ సద్బ్రాహ్మణుడు నొచ్చుకున్నాడు. తరువాత ఆ సేవకుడు స్వామికి యథావిధిగా భిక్ష యిచ్చినప్పుడు ఆయన స్వీకరించలేదు. తన నేరమేమని అడిగిన సేవకునిచేత ఆ హరిజనుని పిలిపించి, అతడి నొసట విభూతి పెట్టి, నేలమీద ఏడుగీతలు గీచి, "ఒక్కొక్క గీత దాటుతూ పూర్వజన్మల స్మృతిని పొంది చెప్పమన్నారు. అతడు వేరువేరు జన్మలలో వివిధ వర్ణాలలో జన్మించానని, ఏడు జన్మల క్రిందట తానొక కర్మఠుడైన బ్రాహ్మణుడని చెప్పాడు. శ్రీ స్వామివారు పరీక్షించగా అతడు వేదవేదాంగాలలోని విషయాలను వల్లించి తన పూర్వ జన్మజ్ఞానం యథార్థమని నిరూపించుకున్నాడు. 'అయితే యీ జన్మలో యీ వర్ణంలో జన్మించావేమి? అని శ్రీ స్వామివారడిగితే, తాను బ్రాహ్మణుడుగా ఉన్నప్పుడు యితర వర్ణస్తులను అసహ్యించుకుంటూ, వారందరూ నడచిన బాటమీద మంత్రజలం చల్లుకొని శుద్ధి చేసుకొని నడిచేవాడననీ, అట్టి అన్యచింతన వలన తనకిప్పుడు యీ జన్మ ప్రాప్తించిందనీ ఆ హరిజనుడు చెప్పాడు. వర్ణభేదం జన్మవలన వస్తుందని తలచి సంకుచితమైన అసహనాన్ని వహించిన వారు జన్మాంతరంలో ఆధ్యాత్మిక జ్ఞానానికే అవకాశంలేని కుటుంబాలలో జన్మించవలసి ఉంటుందని శ్రీ స్వామివారు తన సేవకునికి

తెలియబరచారు. శాస్త్రాల అర్థాన్ని మహనీయుల యొద్ద తెలుసుకొనక మనకు తోచిన తప్పడు అర్థాలను అనుసరించి నడుచుకుంటే కలిగే అనర్థమే యిది.

వారి యీ భావం యింకా స్పష్టమయ్యేలాగా ఆయన తరచు భక్తులతో, 'మాలవాళ్ళు, మాదిగవాళ్ళు నీలో లేకుండా చూచుకో అయ్యా' అనేవారు. ఒక్కొక్కప్పడు అన్యవర్ణస్థులు తమ దర్శనానికి వచ్చినపుడు వారిని శ్రీ వెంకయ్యస్వామివారు బ్రాహ్మణులనేవారు. ఉదా: జన్మతః వైశ్యులైన పి.సుబ్బరామయ్యను ఆయన బ్రాహ్మణుడనేవారు. అలానే అల్లు భాస్కర్ అనే రెడ్డి వర్ణస్థుడు వారి దర్శనానికి వస్తుంటే 'అడుగో ఒక బ్రాహ్మణు డొస్తున్నాడు' అన్నారు శ్రీ స్వామివారు. అంటే ఆయన దృష్టిలో మహాత్ముల యందు పూజ్య భావము, మోక్షము లేక బ్రహ్మజ్ఞానము కోసం కోరికగలవారే బ్రాహ్మణులన్నమాట. సరిగా వజ్రసూచి ఉపనిషత్తులలో బ్రాహ్మణత్వం యిలానే నిర్వచించబడడం గమనార్హం. అంతేగాక ధర్మశాస్త్ర గ్రంథాలలో గూడా జన్మతః బ్రాహ్మణుడైనవాడు గూడా నిజమైన బ్రాహ్మణత్వానికి తగనిరీతిన జీవించినట్లయితే అతడికి శూద్రత్వము, చండాలత్వం ప్రాప్తించి, అతడు ధర్మబాహ్యుడౌతాడని చెప్పబడ్డది. అంటే ముముక్షువుకుండవలసిన గుణాలుగల్గి, వాటికి తగినరీతిన జీవించేవాడే బ్రాహ్మణుడనే అర్థం గదా? అటువంటివాడికి మాత్రమే బ్రాహ్మణ సంస్కారాలన్నీ సార్థకమౌతాయని గదా శాస్త్రం?

ఒకప్పడు శ్రీ స్వామివారు "బ్రాహ్మణులలో మాదిగవాళ్ళు ఉన్నారు. మాదిగవాళ్లలో బ్రాహ్మణవాళ్ళు ఉన్నారు. కోమటి వాళ్లలో కమ్మవాళ్ళు, కమ్మవాళ్లలో కోమటివాళ్ళు ఉన్నారు. గొల్లవాళ్లలో మాలవాళ్ళు, మాలవాళ్లలో గొల్లవారు ఉన్నారు. లోకమంతా యీ విధంగా ఉందయ్యా" అని అన్నారు.

అటువంటి గుణాలను దైవ సంపద, సత్వగుణము అని భగవద్గీత అభివర్ణించిందని మనం గుర్తించాలి. అట్టివారు చేసిన యజ్ఞ, దాన, తపః, కర్మలు మాత్రమే మోక్షమనే సాఫల్యాన్ని పొందుతాయని గూడా భగవద్గీతలోని శ్రద్ధాత్రాయ విభాగయోగము స్పష్టంగా చెపుతుంది. దీనినే





శ్రీ వెంకయ్యస్వామివారు, "సంపన్నత్వం, సాధారణత్వం గల్గి, సద్గురు సేవ చేయమనేవారు. సంపన్నత్వమంటే పైన చెప్పిన దైవీసంపద గల్గియుండడమన్నమాట.

సాధారణత్వమంటే అట్టి గుణాలు తనలో ఉన్నాయని, తానొక సాధువు లేక ముముక్షువునని, తాను పవిత్రుడనని విర్రవీగి, సాటివారిని హీనులుగా తలచకుండడం అన్నమాట. ఈ సూత్రానికి స్వామి యొక్క జీవిత విధానమే చక్కటి ఆదర్శం. అందుకే అటువంటి మహనీయుల ఆచరణనే, బోధనే ప్రమాణంగా స్వీకరించాలని ధర్మశాస్త్రాలు ఘోషించాయి.

## గురుదేవులతో కబుర్లు

నాలుగు నెలలు గడిచిపోయాయి మీరు తెరమరుగై. సూత్రధారి మీ పాత్ర పూర్తిఅయ్యాక మిమ్మల్ని తెరచాటుకు తీసుకువెళ్లాడా-లేక మీరే త్వరపడి పూర్తి చెయ్యకుండానే సూత్రధారికి చెప్పకొని దాటివెళ్లారా? ఈ సందేహానికి అర్థం లేదని తెలుసు. కానీ, చివరిరోజులలో మీ ప్రవర్తన, మీ చూపులో, నవ్వులో, మీ ఏకాంత జీవనంలో మీలో వచ్చిన మార్పులు చూచినదాన్ని గనుక నాలో యీ సందేహం సెల వేస్తూనే ఉంది గురుదేవా!

గత ఆదివారంనాడు మీ వాళ్లమందరం సమావేశమైనప్పడు నాయర్‌గారు మీరు చెప్పిన ఏయే విషయాలను తాము అనుసరిస్తున్నా మన్న విషయం ఎంతో ఉద్వేగంగా చెప్పారు. "మనం వశిష్ఠుడు, అగస్త్యుడు మొదలైన ఋషులు ఉండేవారని విన్నాంగానీ చూడలేదు. మన గురువు వారు యీ యుగంలో ఆ మహర్షుల కోవకు చెందినవారే. అందుచేత మనం కూడా మహాభాగ్యశాలురమయ్యాము" అన్నాడు రామ్మోహనరావు.

గురువుగారండీ! చాలా ఏళ్లక్రితం-మనం యింకా ఆశ్రమస్థాపన చేయకముందు-ఒకసారి బాసర వెళ్లాం ఐదారుగురం కలిసి. అక్కడ వరండాలోనే పడుకోవలసి వచ్చింది-ఎక్కడా చోటులేక. అక్కడ అట్టే


దోమలు లేవుగానీ, వెనక చేలల్లోంచీ పెద్దపెద్ద పురుగులు-నల్లగా ఝుమ్మని శబ్దం చేస్తూ వందలాదిగా రాసాగాయి లైటు వెలుగుకు. ఆ లైటు తీసేందుకు స్విచ్చి లోపల ఏ గదిలో ఉందో తెలియలేదు మనకు. మిగిలినవాళ్లంతా ముసుగులు బిగించేసి నిద్రపోయారుగానీ మీరు, నేను, మా అబ్బాయి భాస్కర్ - ముగ్గురం మాత్రం నిద్రపోలేదు. అప్పుడు 'అపరోక్షానుభూతి”-శంకరుల గ్రంథం ఉంది నా సంచిలో. అంచేత తెల్లవారుజాము వరకూ అది చదువుతూ దానికి మీరు చెప్పే వ్యాఖ్యానం వింటూ గడిపేసాము. అదుగో మీకు గుర్తుంది-నవ్వుతున్నారు కూడా! ఐతే నాకిది ఎందుకు గుర్తు వచ్చిందంటే ....

కంటికి కనిపించేది ప్రత్యక్షం-దృశ్యం. అగుపించనిది పరోక్షం. దీన్ని మనం చూడనూ లేము, ఎవరికీ చూపనూ లేము. ఐతే-పరమాత్ముడు ప్రత్యక్షంగానే ఉంటాడు. పరోక్షంగా ఎక్కడో ఉండడు. మనచుట్టూ ఉన్న ప్రతిజీవిలోను, కణకణంలోను, మనలోనూ కూడా ఉంటాడు. ప్రత్యక్షంగానే ఉన్నప్పటికీ (పరోక్షంగా లేనప్పటికీ) మనం చూడలేము. ఆయన అవాఙ్మానసగోచరుడు-మాటకూ, మనసుకూ అందనివాడు-కేవలం అనుభూతి చెందవలసిన (ఫీల్ కావలసిన)వాడు. ఇదే అపరోక్షానుభూతి అంటే కదా! గురుదేవా, యిప్పుడు మీరు మీ కనులఎదుట లేరు. కానీ ఎక్కడికీ వెళ్లలేదు. మీ శక్తి చిచ్ఛక్తిలో లీనమై యిక్కడ ఉన్నది. పరోక్ష మయ్యారన్న భ్రాంతి తొలగించుకోగలిగితే-అపరోక్షానుభూతితో మీ సాన్నిధ్యాన్ని అనుభవించగలం. ఇది సత్యం. నిన్న రాత్రి తీవ్రమైన మంటతో (శరీరంలో) చాలా బాధపడుతూ, పదేపదే మిమ్మల్నే పిలిచాను. కన్నీళ్లతో “గురువుగారండీ, నాకు బాధగా ఉన్నదండీ!” అని మళ్లీమళ్లీ ఐదారుసార్లు చెప్పకొన్నాను. అప్పటికి నాలుగు గంటలుగా వేధించిన ఆ మంట ఐదే అయిదు నిముషాలలో మాయమైపోయింది. అలా మీకు ప్రతిదీ విన్నవించుకొనే స్పృహ నాలో ఎల్లవేళలా నిలిచి ఉండేలా చెయ్యండి గురుదేవా! మీకిదే మీ పిచ్చితల్లి పాదాభివందనం. సెలవా!





# ఆధ్యాత్మిక శిబిరం



ప్రియమిత్రులారా,

పరమపూజ్య గురుదేవులు గతంలో కొన్ని ఆధ్యాత్మిక శిబిరాలు నడిపించారు. నిరాడంబరంగా, అనుష్ఠానాత్మకంగా, ఆలోచనాత్మకంగా సాగిన ఆ శిబిరాలలో శిక్షణ పొంది లబ్ధి పొందిన కొందరు భక్తులు - గురుదేవులు కనుమరు గయ్యాక, తిరిగి నడుపుకోగలిగితే బాగుం టుందనీ, నిరంతరం మననం ఉంటే మనసులు బూజుపట్టకుండా ఉంటాయనీ బలంగా అభ్యర్థించటంచేత-

**నెలలో ప్రతి రెండవ ఆదివారం ఉదయం గం.7.00 నుండి సాయంత్రం గం.7.00 (సాయం హారతి పూర్తి అయ్యేవరకు)**

ఈ ఆధ్యాత్మిక శిక్షణ నిర్వహించుకోవాలని నిర్ణయింపబడింది. దీనికి

**ఎ) స్థలం :** సాయిధామం ఆశ్రమం

**బి) విషయాలు :** యోగా, ధ్యానం, భజన, స్వాధ్యాయం-చర్చ, స్వీయానుభవాలు, మననం కోసం అంశ ప్రకటన, ముగింపు

**సి) ఆహారం :** పాలు, మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రవపదార్థాలు, పళ్లు


**డి) తెచ్చుకోవలసిన వస్తువులు :** (పాలు, మజ్జిగ ఆశ్రమం యిస్తుంది) పండ్లు, 1 డైరీ లేదా నోట్‌బుక్, పెన్ను

**ఈ) రుసుము :** ఐచ్ఛికంగా యిచ్చే దక్షిణే

**షరతు :** దీనిలో భాగస్వాములు కాదలచినవారు నాలుగు రోజుల ముందు ఫోన్ ద్వారా మీ పేర్లు వ్రాయించుకోవలసి ఉంటుంది. ఇది ఏర్పాట్ల సౌలభ్యం కోసం మాత్రమే.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందవలసిందిగా అందరికీ యిదే ఆహ్వానం -

**- ధర్మాధికారి,**
**సాయిధామం.**



# నిరంతర అధ్యయనం

- మాతాజీ

ఆదిమానవుడు ఉద్భవించి ఎంతకాలమైందో స్పష్టమైన లెక్కలేదు. ఏదో పాత రాతియుగం, క్రొత్త రాతియుగం అంటూ అంచనాలు కట్టుకొన్నాం. అసలు రాతి నుండీ మనిషి దాకా ఉన్న వివిధ దశల సృష్టిని గమనిస్తే మనకు మానవుడెంత గొప్పవాడో, అంత విశిష్టత ఎలా సాధించ గలడో అర్థమవుతుంది. రాతికి స్పందన ఉండదు. జస్ట్ ప్రపంచంలో ఉంటుంది-అంతే. దానికి కాఠిన్యం తప్ప వేరే స్పందనలేవీ ఉండవు. ఆ కాఠిన్యంలో స్థాయీభేదం ఉండవచ్చు.

వృక్షాలను చూద్దాం-వాటికి ప్రాణం ఉంది. భయం, సంతోషం, బాధ వంటి స్పందనలుంటాయి. కానీ, అవి వాటితోపాటు సహజాతాలుగా వచ్చినవే తప్ప అనుభూతిలోనుంచీ వచ్చే సంస్కారాలు కావు. జంతువుల దగ్గరకు వస్తే-కనిపెంచడాలు, తన-పర అనే భేదాలు, క్రూరత్వం, మెత్తదనం మొదలైన లక్షణాలు, కొంతవరకు అనుబంధాలు ఉంటాయి. ఈ అనుబంధాలు కొన్ని జంతువులలో ఎక్కువగా, కొన్నింటిలో తక్కువగా కన్పిస్తున్నాయి. పక్షులలో కూడా కొన్నింటిలో మధుర స్వరాలు, కొన్నింటికి కఠోర స్వరాలు ఉండటం సహజాతం.. గ్రుడ్లుపెట్టి పొదగటం పిల్లలకు ఆహారం తెచ్చివ్వటం, రెక్కలు వచ్చేదాకా ఎంతో జాగ్రత్తగా పెంచటం-ఇలాంటివన్నీ సంస్కారాలుగా పెరిగి అనుబంధాలు పెంచుతాయి.

ఇక మానవుల దగ్గరికి వస్తే-మనిషిలో అన్ని యుగాల లక్షణాలూ ఉన్నాయి. మనుష్యులలో కూడా స్పందన, సున్నితత్వం లేని బండరాళ్లుం టాయి. కనిపెంచడాలు, అభిమానాలు వగైరాలతోపాటు ప్రేమ-ద్వేషం,





స్వార్థం-త్యాగం, లాలిత్యం-క్రూరత్వం వంటి విరుద్ధ భావాలకు నిలయంగా కన్పిస్తాడు మనిషి. భావశబలత-అంటే అనేకానేక రకాల భావాల సమ్మేళనం కూడా మనిషిలో కన్పిస్తుంది. ఒకే విషయాన్ని ఒకసారి ఒక కోణంలోనూ, మరోసారి విరుద్ధకోణంలోనూ చూస్తాడతడు. ఒకే దోషాన్ని ఒకసారి క్రోధభావంతోనూ, మరోసారి క్షమాభావంతోనూ చూస్తాడు. ఈ ద్వంద్వ భావాలను సరియైన పద్ధతిలో, సంయమనంతో సరిచూచుకోవడానికీ, తన తీరుతెన్నులను సరిచేసుకోవడానికీ వీలుగా భగవంతుడు ఒక అద్భుతమైన శక్తినిచ్చాడు మనిషికి. దాన్నే వివేచన అన్నారు. ఈ వివేచనే మనిషిని మిగిలిన జీవకోటి కంటె ఉన్నతుడిగా తీర్చిదిద్దగలదు. ఆ వివేచన ఉండటం వల్లనే మనిషి మిగిలిన సృష్టిని ఎలా, ఎంతవరకు ఉపయో గించాలో నేర్చుకోగలిగాడు. తెలివితేటలు వేరు-వివేచన వేరు. తెలివి నిన్ను ప్రభువును చేస్తుంది-వివేచన నిన్ను మంచి పరిపాలకునిగా తీర్చి దిద్దుతుంది. తెలివితేటలు దైవదత్తాలైన వరాలు. వాటిని యోగ్యమార్గంలో నడపగలది నీ వివేచనే.

ప్రస్తుత ప్రపంచంలో తెలివితేటలు, స్వార్థం, విశృంఖల విహారం చేస్తూ వివేచనను ఛాందసంగా, అవివేకంగా, బొత్తిగా లౌక్యం తెలియని వెర్రిబాగులతనంగా భావింపజేస్తున్నాయి. మంచితనం చేతకానితనంగా, సహనం చేవలేనితనంగా భావిస్తోంది లోకం. ఇలాటి సమయంలో వివేచనాశక్తి నశిస్తూ మనిషిని మళ్లీ వెనక్కు వెనక్కు ఏ స్పందనాలేని బండరాళ్లుగా మారుస్తోందా అనిపిస్తున్నది.

యుక్తాయుక్తాలు ఆలోచించగలగాలంటే ప్రతి వ్యక్తికీ కొంత జ్ఞానం అవసరం. మనకున్న విజ్ఞతతో ఏది యుక్తమో, ఏది అయోగ్యమో తెలియ

లేకపోతే గురుజనులను అనుసరించాలి. అదీ అందకపోతే శాస్త్రమే ఆధారంగా తీసుకోవాలి. అందుచేతనే పెద్దలు సందేహం నివృత్తి కావాలంటే శాస్త్రాధ్యయనం అవసరమని అన్నారు. ఏదో సంస్కృతంలోనో, లేటిన్‌లోనో చదవలేకపోయినాగానీ సరళమైన భాషలో ఉన్న మహనీయుల చరిత్రలు, బోధలు, భగవద్గీత మొదలైనవయినా అధ్యయనం చేయాలి. శ్రీ దత్తాత్రేయ చరిత్ర, శ్రీ సాయినాథ చరిత్రలు ఎంతో వికాసం కలిగించగలవు. రమణులు, రామకృష్ణ పరమహంస, వివేకానందులు, పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానందప్రభుజీ వారు మొదలైన పుణ్య పురుషుల బోధామృతాలు నిత్యపానం చేస్తుంటే వివేకవికాసం కలగడం తథ్యం. అలా కానినాడు మనం అనుకొన్నదే సత్యమనీ, ఆచరించిందే వేదమనీ భ్రమించి పతనమయ్యే అవకాశాలు వేనవేలు. మనిషికి ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం-యీ మూడూ ఉంటే వాడు మహామేధావి కాగలడు. జన్మతః వచ్చే ప్రజ్ఞనే ప్రతిభ అంటాం. గురుముఖతః విన్నవీ, లోకజ్ఞతతో నేర్చినవీ కలిసి వ్యుత్పత్తి అవుతాయి. మనం ఎంత సహజ ప్రజ్ఞావంతులమైనా, ఎంత జ్ఞానం నేర్చినా, దానిని సక్రమమార్గంలో అదేపనిగా అభ్యాసం చేయకపోతే ఆజ్ఞానం సదుపయోగంలోకి రాదు. అలా మళ్లీమళ్లీ ఆచరణలో తెచ్చుకోవాలంటే పదేపదే అధ్యయనం చేయటం కూడా అవసరం. అంచేత నిత్యమూ ఏదో ఒక సద్గ్రంథపారాయణ తప్పనిసరి కార్యక్రమాలలో ఒకటిగా చేర్చుకోవాలి సాధకులు. అధ్యయనం పూర్తి చేసాక-అందులో మనకు బాగా నచ్చిన అంశాన్ని తీసుకొని ఆ రోజంతా మననం చేస్తూ, ఆచరించే ప్రయత్నం చెయ్యాలి. అలా కాకపోతే తీర్థానికి తీర్థం, ప్రసాదానికి ప్రసాదం అన్నట్లుగా అయిపోతుంది. చదవటం అన్నది మనలో జ్ఞానాహంకారాన్ని పెంచడానికి తప్ప ప్రయోజనం సిద్ధించదు. అది కూడా గుర్తుంచుకోవాలి.





# అఖండ శాంతి

- స్వామీ వివేకానంద

**(స్వామీజీ, చివరికాలంలో అద్భుతమైన లేఖ ఒకటి మెక్లౌడ్ అనే భక్తురాలికి వ్రాసారు. గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారు తమ చివరి మూడు నెలలలో ప్రవర్తించిన తీరుకు, వెలువరించిన అభిప్రాయాలకు - ఈ లేఖకు చాలా దగ్గరి పోలికలున్నాయి. ఆ స్మృతితో యీ లేఖ సాయివాణి పాఠకులకు అందిస్తున్నాం. - ప్రధాన సంపాదకులు)**

కర్మ చేయటం ఎల్లప్పుడూ కష్టమే. నా విధ్యుక్త కర్మలు శాశ్వతంగా ఆగిపోవాలనీ, నా మనస్సు పూర్తిగా జగజ్జననిలో లీనం కావాలనీ నా కోసం ప్రార్థించు. ఆమె పనులు ఆమెకే ఎరుక.

నాకు అఖండమైన మనశ్శాంతి లభిస్తున్నది. శారీరక విశ్రాంతికన్నా ఆత్మశాంతిని ఎక్కువగా చవిచూస్తున్నాను. జీవితపోరాటాల్లో జయం కల్గింది, అపజయమూ వాటిల్లింది. నా వస్తువులన్నీ మూటగట్టుకొని ప్రయాణానికి సిద్ధంగా ఉన్నాను. శివా, ఓ శివా, నన్ను ఆవలి తీరం చేర్చు. నేను దక్షిణేశ్వరంలో వటవృక్షం క్రింద కూర్చొని, అద్భుతమైన రామకృష్ణ వచనామృతాన్ని సమ్మోహితుడనై ఆస్వాదించే బాలుణ్ణి మాత్రమే. ఇది నా సహజ నైజం. కర్మలు, కార్యకలాపాలు, జగద్ధితం యిత్యాదులన్నీ నామీద ఆవరింపబడినవే. నా ఆత్మను పులకింపజేసే ఆ మధురవాణినే ఆలకిస్తున్నాను. బంధాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ప్రేమ అంతరిస్తోంది. కర్మ రసహీనమవుతోంది. జీవిత వ్యామోహం తొలగిపోయింది. గురుదేవుల కంఠధ్వని వినిపిస్తోంది.

**"ఓ ప్రభూ! నేను వస్తున్నాను, ఇదిగో వస్తున్నాను".**

**"మృతులు, మృతులను పూడుస్తారుగాక! నన్ను అనుగమించు".**

**వస్తున్నాను. నా ప్రియతమ ప్రభూ! ఇదిగో వస్తున్నాను"**

"అవును వస్తున్నాను. నిర్వాణం నా ఎదుట దీపిస్తోంది. అనంతం, విస్తారం అయిన ఆ అనంత శాంతిసాగరమే నన్ను అనేకసార్లు ఆవరించినట్లు అనుభూతి చెందుతున్నాను. నేను జన్మించినందుకు ఆనందిస్తున్నాను. కష్టాలు అనుభవించినందుకు ఆనందిస్తున్నాను. శాంతిలో (సాగరంలో) ప్రవేశించినందుకు ఆనందిస్తున్నాను. ఒక్క ప్రాణిని సైతం బద్ధునిగా వదలివేయను. బంధాలను నా మీద వేసుకోను. నాకు విదేహ ముక్తి కలిగినా, జీవన్ముక్తి లభించినా సరే. ఈ శరీరంలోని పాత మనిషి శాశ్వతంగా వెళ్లిపోయాడు. మళ్లీ రాడు. మార్గదర్శకుడు, గురువు, నాయకుడు, ఆచార్యుడు వెళ్లిపోయాడు. ఆ బాలుడు, ఆ విద్యార్థి, సేవకుడు మాత్రమే నిలిచి ఉన్నాడు....

కాలప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న నిమిషాలే నా జీవితంలో ఆనందమయ సమయాలు. నేను మళ్లీ కొట్టుకుపోతున్నాను-ప్రకాశిస్తున్న వెచ్చని సూర్యుడు ముందున్నాడు. చుట్టూ పచ్చని వృక్ష కోట్లు ఉన్నాయి. ఆ వెచ్చదనంలో సమస్త విశ్వం నిశ్చలంగాను, శాంతిమయంగాను ఉంది. వెచ్చని నదీజలాల్లో నిశ్చింతగా కొట్టుకుపోతున్నాను. నా చేతులతోను, వ్రేళ్లతోను నీటిని చిందించి, యీ మహాద్భుత ప్రశాంతతను, యిదంతా మహామాయ అని తోపింపజేసే యీ అఖండ ప్రశాంతతను ఛేదించడానికి నేను సాహసించను.

"నా పని వెనుక ఆశ ఉంది, నా ప్రేమ వెనుక వ్యక్తిత్వం ఉంది. నా పవిత్రత వెనుక భయం ఉంది. నా నేతృత్వం వెనుక అధికారదాహముంది. యిప్పుడు అవన్నీ అదృశ్యమవుతున్నాయి. నేను కొట్టుకుపోతున్నాను, వస్తున్నాను. జననీ! నేను వస్తున్నాను! నీ వెచ్చని ఒడిలో లోకాతీతమైన లోకంలో యీ యిచ్ఛ వలన ఏ చోటికి నువ్వు నన్ను గొనిపోయినా అక్కడికి వస్తాను. నేను యిక కర్తనుగాను, సాక్షిని మాత్రమే!





"ఆహా! యిది ఎంత శాంతంగా ఉంది. నా భావాలు ఎంతో దూరం నుండి, నా హృదయాంతరాళంలో నుండి వస్తున్నట్లున్నాయి. అవి అస్పష్టమైన దూరం నుండి వచ్చే గుసగుసలుగా ఉన్నాయి. మధురాతి మధురమైన ప్రశాంతత అన్నింటి మీదా విస్తృతించినట్లుంది. నిద్రలోకి జారడానికి ముందు కొన్ని నిముషాలు, భయం, ప్రేమ, రాగద్వేషాలు లేక విషయాలు నీడలా తోచినప్పుడు అనుభూతమయ్యే ప్రశాంతత అది. ప్రతిమలు, చిత్తరువులు, చుట్టూ పరివేష్టించి ఉండగా, ఏకాంతంలో మనిషికి అనుభవమయ్యే ప్రశాంతత అది. వస్తున్నాను, ఓ ప్రభూ, వస్తున్నాను.

"జగత్తు ఉంది, అది అందంగాను లేదు, అందవికారంగానూ లేదు. ఏ విధమైన రాగద్వేషాలనూ కల్పించనట్టి బాహ్యస్పర్శగా ఉంది. ఓ, "ఓ! ఏమి ఆ ఆనందం! సమస్తం యోగ్యంగాను, మనోజ్ఞంగాను ఉంది. నేను విషయాలూ, సుఖదుఃఖాది ద్వంద్వాలూ కోల్పోతున్నాను. నాకు శరీర స్పృహ తొలగిపోతోంది. ఓం తత్సత్!"

## మాతృసంస్థ కబుర్లు

నవంబరు నెలంతా సాయిధామం వెలుగునీడల సమ్మేళనంగా గడిచింది. కార్తీకమాసం కావటం చేత వచ్చిపోయే భక్తులు, వనభోజనాలకు వచ్చే భక్తుల సంరంభం మొదలైన వాటితో కొంత హడావుడి కన్పించింది. కానీ, ఆనందంగారికి తీవ్రమైన అనారోగ్యం చెయ్యటం, బైపాస్ సర్జరీదాకా రావటం, అసలే గురుదేవుల నిష్క్రమణతో అల్లాడుతున్న ఆశ్రమవాసులకు యిది మూలిగే నక్క మీద తాటిపండు పడినట్లయింది. దానితో ఆవేదనకు గురై ఆసుపత్రులకు, తిరుగుళ్లు రకరకాల టెస్టులు, డాక్టర్ల సమాలోచనలు-ఆఖరి క్షణంలో

శ్రీ సాయినాథుల వారు తమ రక్షా.. అడ్డుపెట్టటం, గురుకృపావృష్టిలో తడిసిన ఆనందంగారికి బైపాస్ సర్జరీ కాక, రెండు స్టంట్‌లు వేస్తే చాలు ప్రస్తుతానికి-అని సర్జన్లు నిర్ణయించటం-వీటన్నిటితో ఆనందవిచారాల సమ్మేళనంగా సాగింది నవంబరు చివరంతా. శ్రీ ఆనందంగారి పట్ల అభిమానంతో ముందుకువచ్చి వారి వైద్యానికి సహకరించిన వైద్యులకూ, చేయందించిన ఆప్తులందరికీ శ్రీ సాయిరక్ష నిరంతరం లభించాలని ప్రార్థిస్తున్నది ఆశ్రమం.

నవంబరు 22వ తేదీన క్షీరాబ్ధి (చిలుకు) ద్వాదశి. ఆరోజు శ్రీ సాయినాథక్షేత్రంలో ఉసిరిచెట్టు క్రింద తులసిపూజ ప్రతి సంవత్సరం లాగానే గ్రామీణ స్త్రీలందరూ ఆనందకరంగా చేసుకున్నారు. 25వ తేదీ కార్తీక పూర్ణిమ. ఆ రోజున క్షేత్రంలో ఉదయం విశేషపూజలు జరిగాయి. సాయంత్రం నుండీ మహిళలందరూ, కొందరు పురుషులు కూడా శ్రీ సాయి దేవాలయానికి రాసాగారు. లక్ష దీపార్చనకై ఏర్పాట్లు జరిగాయి. మున్నూట అరవై అయిదు రోజులపాటు పెట్టవలసిన దీపాలన్నీ ఆ ఒక్కరోజు పెట్టినా పుణ్యమేనన్న విశ్వాసంతో ఇంటింటి నుంచీ దీపాలు తెచ్చి స్వామి ముందర వెలిగించుకున్నారు. రెండు వందల మందికి పైగా యిల్లాళ్లతో ఆలయం నిండా, ప్రాంగణం నిండా జ్యోతులతో ఉత్సవం కళకళలాడుతూ కన్నులపండువు చేసింది. ప్రసాద వితరణ జరిగింది.

అదేరోజు శ్రీ కోదండరామ సాయి సన్నిధానంలో ఉదయం క్షీరాభిషేకం, సహస్ర నామపూజ, పది గంటలకు సామూహిక సాయినాథ వ్రతం జరిగాయి. సాయంత్రంవేళ భక్తురాళ్లంతా వచ్చి దీపోత్సవం చేసారు. శివలింగాకారంలో దీపాలన్నీ పొందికగా అమర్చి, పూజించారు.





ఆలయంలో విశేషపూజలు, సంకీర్తనం జరిగాయి. ప్రసాదవితరణ జరిగింది.

డిసెంబరు 13వ తేదీ ఆదివారం. ఆనాడు ప్రారంభించి, ప్రతినెలా రెండవ ఆదివారంనాడు స్పిరిచ్యువల్ రిట్రీట్ జరుపుకోవాలని నిర్ణయించుకొన్నారు సాయిధామంలో. ఉదయం ఏడున్నర గంటలకు శ్రీ సాయిదేవ, గురుదేవుల దీపారాధనతో ఉదయకాల ప్రార్థనతో ప్రారంభమైంది కార్యక్రమం. ప్రాణాయామాదిక యోగ శిక్షణ తరువాత, భజన, అటుపైన ధ్యానం. అలా నాలుగు సెషన్లలోను ధ్యానం, స్వాధ్యాయం, దానిపై చర్చ సాగాయి. నడుమ నడుమ పదిహేను, ఇరవై నిముషాల విశ్రాంతి ఇచ్చారు. మధ్యాహ్న హారతి తరువాత జరిగిన సెషన్లలో 'నేను-సేవ', 'నేను-సాయి లేదా గురుదేవులు' వంటి ఆసక్తికరమైన అంశాలు కూడా చోటు చేసుకున్నాయి. ఆశ్రమ బాలబాలికలు కూడా గురుదేవులను గూర్చిన ఎన్నో అనుభవాలు గుర్తు చేసుకోవటం, చంద్రారెడ్డిగారు, ఆనందంగారు, శర్మగారు, తేజస్వినిల జ్ఞాపకాలు ఎంతో ఆర్ద్రంగా అనిపించాయి. ఏడు పదులు దాటిన వృద్ధులతో సమంగా పదుమూడు, పద్నాలుగేళ్ల పిల్లలు కూడా పగలంతా కేవల ద్రవాహారం, రెండు పళ్లతో ఉండి యీ శిబిరంలో ఆనందంగా పాల్గొనటం ఆనందప్రదమైంది. గురుదేవులు కనుమరుగయ్యాక చాలాకాలానికి రోజంతా ఆధ్యాత్మిక స్పృహతో గడపగలిగినందుకు పాల్గొన్న వారంతా ఎంతో (రిలాక్స్‌డ్‌గా) ఒత్తిడి తగ్గినట్లు తేలికపడ్డారు.